

కడెం ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

# కడెంలో తగ్గిన నీటిమట్టం

## - యాసంగి పంటకు సరఫరా కష్టమే

కడెం, డిసెంబర్ 7: కడెం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గగా, యాసంగి పంటకు నీరివ్వడం కష్టంగా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 683.350 అడుగల (208.285టీఎంసీల) వద్ద ఉంది. ఈ ఏడాది వానకాలం 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు పూర్తిస్థాయిలో నీటిని అందించగా, ప్రస్తుతం నీటిమట్టం తగ్గింది. భారీ వర్షాల కారణంగా వరదగేట్ల కౌంటర్‌వెయిట్లు తెగిపోవడంతో గేట్లు పూర్తిస్థాయిలో తెరుచుకొని ఉండడం వల్ల ప్రాజెక్టులోని నీరంతా వృథాగా పోయింది. దీంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి..ఉన్న నీటిని వానకాలం పంటకు అందించారు. ప్రస్తుతం డెడ్‌స్టోరేజ్ దశలో ఉండడంతో యాసంగి పంట కోసం నీటిని అందించడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో రైతులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. 683.350 అడుగుల (208.285టీఎంసీల) వద్ద ఉన్న నీటిని కనీసం కొనిన డిస్ట్రిబ్యూటరీల వరకైనా ఇవ్వాలన్నదే రైతుల ప్రధాన డిమాండ్.

# అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఇంద్రవెల్లిలో గ్రామ సభ
- చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చ

ఇంద్రవెల్లి, డిసెంబర్ 7 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటు చేసి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ రాహూల్‌రాజ్ అన్నారు. గురువారం ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద సర్పంచ్ కోరెంగా గాంధారి అధ్యక్షతన ఆదివాసీ గిరిజనులతో పాటు అమరవీరుల కమిటీ సభ్యులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. అమరవీరుల స్తూపం వద్ద చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. స్మృతి వనం ఏర్పాటుకు కావాల్సిన ఖర్చులపై నివేదికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు స్మృతి వనం ఏర్పాటు కోసం తీర్మానం చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు పిలిపించుకొని జోడేఘాట్, అమరవీరుల స్తూపం అభివృద్ధి కోసం ప్రత్యేక నివేదికలు అడిగినట్లు తెలిపారు. అనంతరం మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. కెస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్ మాట్లాడుతూ జనవరిలో నాగోబా జాతర ప్రారంభం కానున్నదని, ఇప్పటి నుంచే జాతర ఏర్పాట్లతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, సర్పంచ్ కోరెంగా గాంధారి, డీఆర్‌డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఐటీడీఏ డీడీ దిలీప్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్, ఎంపీవో సంతోష్‌కుమార్, జీపీ ఈవో సంజీవరావ్, ఈసీ జాదవ్ శ్రీనివాస్, గిర్ధవార్ మెస్రం లక్ష్మణ్, స్పెషల్ పోలీసులు రామారావ్, దుర్వా రమణ, రాయిసెంటర్ల సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం చిన్నుపటేల్, వెట్టి రాజేశ్వర్, సమక గ్రామపటేల్ పెందూర్ భగ్వంత్‌రావ్‌పటేల్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, సర్పంచ్‌లు కినక జుగాదిరావ్, కుడే కైలాస్, తుంరం లక్ష్మణ్, నాయకులు నాగ్‌నాథ్, సోమోరే నాగోరావ్, ఆర్కా ఖమ్ము, ముకాడే ఉత్తం, సుంకట్‌రావ్, దూర్‌రాం, ముకాడే విష్ణు, సోయం రాందాస్, తోడసం సాగర్, యాకుబ్ బేగ్, మానిక్‌రావ్, సోమాసే వెంకట్‌రావ్, పోటే సాయినాథ్ పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహూల్ రాజ్

## సత్యదేవుని సన్నిధిలో

# భక్తుల సందడి

దండేపల్లి, డిసెంబర్ 7 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో గురువారం కార్తీక సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదిలో కార్తీక దీపాలు వదిలారు. గంగమ్మ తల్లికి మొక్కుకున్నారు. అనంతరం గుట్ట కింద రావి చెట్టు వద్ద, గుట్ట పైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల కోసం ప్రత్యేకంగా రెండు వ్రత మండపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు, సిబ్బంది ఉన్నారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

# సాంకేతిక విద్య గురించి తెలుసుకోవాలి

## - బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ



ఉన్నత విద్యా సదస్సులో పాల్గొన్న వీసీ వెంకటరమణ

బాసర, డిసెంబరు 7 : హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ఉన్నత విద్యా సదస్సులో బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక విద్యా నైపుణ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛాన్స్‌లర్ బిజేరావు, ఐసీఎఫ్ఏఐ యూనివర్సిటీ హైదరాబాద్ వీసీ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజలతోనే ఉంటా : బీఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్

ఖానాపూర్, డిసెంబర్ 7 : గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజలతోనే ఉంటానని బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానన్నారు. తన గెలుపుకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తనూ గుర్తుంచుకుంటానని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం తన జీవితం అంకితం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మోయిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్‌నాయక్

# జోగును కలిసిన ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, డిసెంబర్ 7 : ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, ఇచ్చోడ, నేరడిగొండ ఎంపీపీ ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ తిరుమల్‌గౌడ్, ఎంపీటీసీ పండరి, గాడ్గె సుభాష్, నాయకులు సయ్యద్ జహీర్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి జోగు రామన్నను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# మా కొడుకును బతికించరూ..!

- కరెంట్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డ ఇంటర్ విద్యార్థి
- వైద్య ఖర్చుల కోసం తల్లిదండ్రుల వేడుకోలు



చికిత్స పొందుతున్న నాగ చైతన్య



నాగచైతన్య(ఫైల్)

దస్తురాబాద్, డిసెంబర్ 7 : కరెంట్‌షాక్‌తో తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య ఉన్న తమ కొడుకు వైద్యానికి సాయమందించాలని ఓ నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. దస్తురాబాద్ మండల కేంద్రానికి చెందిన సింధం మొగిలి(ఆటో డ్రైవర్)-సునీత దంపతుల కుమారుడు నాగ చైతన్య(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం( మంగళవారం) కోతులను తరిమే క్రమంలో ఇంటిపైనున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగులగా, తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. ఎడమ కాలుకు తీవ్రగాయమైంది. వైద్యానికి ఇప్పటికే రూ. 5 లక్షల దాకా ఖర్చు చేశారు. మరో రూ. 5 లక్షలకు పైగా అవసరముందని, దాతలు సాయమందించి తమ కొడుకును కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సెల్ నంబర్ : 9492453410 ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని కోరుతున్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 7 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈనెల 8న శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కల్పన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం 9959226002 సంప్రదించాలని కోరారు.